
ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్‌లో ఆసనాలు వేస్తున్న అధికారులు, సిబ్బంది


యోగాసనాలు వేస్తున్న జడ్జీలు సౌజన్య, స్వాతి భవాని

ఊరూ..వాడా ఉత్సాహంగా.. యోగా

యోగా దినోత్సవ వేళ ఊరూ వాడా ఉత్సాహంగా యోగాసనాల్లో పాల్గొన్నారు. బీచ్ రోడ్డులో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పిల్లలు, పెద్దలు భాగస్వాములు కాగా.. అక్కడికి రాలేని వారు తమ సమీప ప్రాంతాల్లో యోగాసనాలు వేశారు. దైనందిన జీవితంలో యోగా ప్రాముఖ్యతను గురువులు వివరించారు.


వుడా కాలనీలో యోగాసనాలు వేస్తున్న డైరెక్టర్ ఆచార్య గాలబ్ తదితరులు

భీమునిపట్నం: యోగా దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సాధకులు యోగాసనాలు వేశారు. భీమిలిలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సౌజన్య, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.స్వాతి భవాని ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎస్.జనార్దనరావు, కార్యదర్శి కె.మంజుల పాల్గొన్నారు.

ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్‌లో..

పీఎం పాలెం: బక్కన్నపాలెం ఏపీఎస్‌పీ పోలీస్ బెటాలియన్‌లో నిర్వహించిన యోగా దినోత్సవానికి బెటాలియన్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు సారథ్యం వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యాన్ని మెరుగు పరిచే యోగాను ప్రతీ ఒక్కరూ జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మిథిలాపురి వుడా కాలనీలో..

మధురవాడ: మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీస్‌లో శనివారం ఉదయం అధికారులు, సిబ్బంది యోగాసనాలు చేశారు. సంస్థ డైరెక్టర్ ఆచార్య గాలబ్ పర్యవేక్షణలో డాక్టర్ రామశివ నిర్వహించగా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దివీస్‌లో..

తగరపువలస: భీమిలి మండలం చిప్పాద దివీస్ లేబొరేటరీలో ఉదయం రెండు గంటలపాటు జరిగిన వేడుకలలో సంస్థ ఎండీ మురళీకృష్ణ దివి, డైరెక్టర్ ఎస్.దేవేందర్‌రావు, వైస్ ప్రెసిడెంట్ ఎల్.రమణ పాల్గొన్నారు. 1150 మంది ఉద్యోగులతో ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు వైఎస్ కోటేశ్వరరావు, ఎం.ఎస్.ఎన్.రావు, ఇ.రామకృష్ణ, ఎం.రమేష్‌బాబు పాల్గొన్నారు.


అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్‌లో విద్యార్థుల ఆసనాలు


బీచ్‌రోడ్డుపై యోగాసనాలు వేస్తున్న ప్రజలు

- సంతోపేట జీవీఎంసీ అంబేడ్కర్ హైస్కూల్లో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 'వన్ ఎర్త్.. వన్ హెల్త్' .. థీమ్‌ను పాటించాలని ఉపాధ్యాయులు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డిపల్లి అప్పలరాజు, జగదీష్, విశ్వేశ్వరరావు, ప్రతాప్, సునీత, శ్రీదేవి, సత్యలక్ష్మి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో యోగాసనాలు వేస్తున్న ప్రజలు


దివీస్ లేబొరేటరీలో ఆసనాలు వేస్తున్న ఉద్యోగులు

సత్తిబాబు వైద్యానికి కేఆర్‌బీ యూత్ ఆర్థిక సాయం


సత్తిబాబు తల్లికి నగదు అందజేస్తున్న ఎంపీపీ


పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో అనారోగ్యానికి గురైన కాళ్ల సత్తిబాబు వైద్యానికి కేఆర్‌బీ యూత్ రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించింది. ఎంపీపీ కంటుబోతు రాంబాబు తన ఇంటి వద్ద ఈ నగదును సత్తిబాబు తల్లి చినతల్లికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, కేఆర్‌బీ యూత్ సభ్యులు బుగత సతీష్, బక్క మోహన్, కనకల ప్రకాష్ పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ


మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర', 'నీరు-మీరు' లో భాగంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ఆయన మొక్కలు నాటారు. ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, ఈవోఆర్డీ మీనా కుమారి, వెలుగు ఏపీఎం సాయి రమేష్, రామసింగు సన్యాసిరావు,కంటుబోతు ఎర్నాయుడు పాల్గొన్నారు.

యోగాంధ్ర డ్యూటీ కష్టాలు


సర్వీస్‌రోడ్డులో డివైడర్‌పై దోమతెరల మధ్య నిద్రిస్తున్న పోలీస్ సిబ్బంది

తగరపువలస: అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా జన సమీకరణ, బందోబస్తు వంటి బాధ్యతలతో పలువురు ఉద్యోగుల తల ప్రాణం తోకకి వచ్చినట్టయింది. రెండు రోజుల పాటు సచివాలయ ఉద్యోగులు రాత్రనక, పగలనక జనాన్ని సమీకరించడం, యోగా నిర్వహణ ప్రదేశాల రూట్ చూడటం, వేకువజామునే ఇంటింటికీ వెళ్లి తరలించడంతో ఇబ్బంది పడ్డారు. జన సేకరణ జరిగిన ప్రాంతాలలో బందోబస్తు కోసం బయట జిల్లాల నుంచి వచ్చిన పోలీసులు మూడు రోజులుగా కంటిమీద కునుకు లేకుండా గడిపారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత మాత్రం కొందరు పోలీస్ సిబ్బంది రహదారుల పక్కన డివైడర్లపై దోమతెరలు కట్టుకుని నిద్రించారు.

వాటర్ ట్యాంకర్ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి


మృతుడు రాము

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో సర్వీస్ రోడ్డుపై శనివారం సాయంత్రం వాటర్ ట్యాంకర్ ఢీకొన్న ప్రమాదంలో ఒకటో వార్డు బాలాజీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నమ్మి రాము(28) దుర్మరణం చెందాడు. భీమిలి మండలం తాళ్లవలసలో ప్రయాణికులను దించి, ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ట్యాంకర్ బలంగా ఢీకొనడంతో తుక్కయిన ఆటోలోనే తీవ్ర రక్తగాయాలతో మృతుడు చిక్కుకుపోయాడు. స్థానికులు బయటకు తీసి సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి చికిత్సకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రాముకు భార్య మంగమ్మ, ఇద్దరు కుమార్తెలు జ్యోత్స్న (6), నిత్య(4) ఉన్నారు. ప్రస్తుతం మంగమ్మ అయిదో నెల గర్భిణి. తండ్రి అప్పారావు గతంలో రిక్షా కార్మికుడిగా చేసేవారు, ప్రస్తుతం ఇంటికే పరిమితమయ్యారు. తల్లి అప్పయ్యమ్మ వెంకటేశ్వరమెట్ట వద్ద చిన్న టీ దుకాణం నిర్వహిస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటోంది. భార్య, పిల్లలు, తల్లిదండ్రులతో రాము కలిసే ఉండేవాడు. ఇంటి పెద్ద దిక్కు అయిన రాము మరణంతో ఆ కుటుంబం గుండెలవిసేలా రోదిస్తోంది. రాము మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదానికి కారణమైన వాటర్ ట్యాంకర్


ప్రమాదంలో తుక్కయిన ఆటో

ఆ వాటర్ ట్యాంకర్ పేరు చెపితే టెర్రర్

కాలం చెల్లిన ఈ వాటర్ ట్యాంకర్‌ను చూస్తే రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రతి ఒక్కరికి దడే. ట్యాంకర్‌కు బీమా, బ్రేకులు, అద్దాలు, నంబర్ ప్లేట్ లేకపోయినా దర్జాగా రోడ్లపై తిరుగుతుంది. గోస్త నీనది వద్ద వ్యవసాయ మోటారు నుంచి 24 గంటలూ నీటిని తోడి సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించి, దీని యజమాని సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ ట్యాంకర్‌కు ఫిట్‌నెస్, బీమా, నంబరు ప్లేట్ లేకపోయినా భీమిలి పోలీసులు, రవాణా శాఖ అధికారులు కన్నెత్తి అయినా చూడడం లేదు. వీరి నిర్లక్ష్యం కారణంగా ఒక పేద ఆటో డ్రైవర్ బలైపోయాడని బాలాజీనగర్ వాసులు కంటతడి పెడుతున్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ చోరీ

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆంజనేయస్వామి ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. ఆలయం గేటు తాళాలను పగలగొట్టి లోపలికి ప్రవేశించి హుండీ తాళాలను కూడా పగలగొట్టారు. శనివారం ఉదయం బట్టు రాంబాబు అనే భక్తుడు ఆలయంలో ప్రవేశించగా, చోరీ జరిగినట్లు గుర్తించి భీమిలి క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏడాదిగా హుండీని తెరవకపోవడంతో రూ.75 వేల వరకు కానుకలు హుండీలో ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.


తాళం పగలగొట్టిన హుండీ

నేడు శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శన

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాలలో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందని స్థానిక పరిపాలన అధికారి రమేష్ రెడ్డి తెలిపారు. నగరానికి చెందిన జ్యోష్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఉంటుందన్నారు.

రెండు రోజులుగా కరెంటు కోత

రాత్రివేళల్లో విద్యుత్ నిలిచిపోవడంతో అవస్థలు

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వాణి విద్యానికేతన్ వెనుక భాగంలో నివాసాలకు రెండు రోజులుగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతుందని స్థానికులు తెలిపారు. శుక్రవారం రాత్రి 10 గంటలకు అంతరాయం కలగగా, శనివారం ఉదయం 6 గంటలకు పునరుద్ధరించారు. మళ్లీ శనివారం రాత్రి కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అక్కడివారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం రాత్రంతా నిద్రలేకపోయినా శనివారం యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నామని, మళ్లీ శనివారం రాత్రి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినా సిబ్బంది స్పందించడంలేదని సుమారు 50 కుటుంబాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిద్రలేమితో పాటు దోమలు, ఉక్కపోత భరించలేకపోతున్నామని, వెంటనే సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

రికార్డు ప్రయత్నం.. నిర్వహణలోపం


పండ్ల కోసం కుమ్ములాట


తిమ్మాపురంలో మ్యాట్ల కోసం తోపులాట

కొమ్మాది: ఏక కాలంలో లక్షల మందితో యోగాసనాలు వేయించి ప్రపంచ రికార్డు సృష్టించాలనే లక్ష్యంతో చేపట్టిన 'యోగాంధ్ర' కార్యక్రమం ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగించింది. సరైన నిర్వహణ లేకపోవడంతో పాల్గొన్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, సింహాచలం, పాడేరు వంటి ప్రాంతాల నుంచి తెల్లవారుజామున 4 గంటలకే ప్రజలను బస్సుల ద్వారా భీమిలి బీచ్‌రోడ్డులోని గుడ్లవానిపాలెం నుంచి ఉప్పాడ వరకు ఏర్పాటు చేసిన కంపార్ట్‌మెంట్ల వద్దకు తీసుకొచ్చారు. అయితే రవాణా వ్యవస్థలో సమన్వయం లోపించడంతో బస్సులు కిలోమీటర్ల మేర నిలిచిపోయి గంటల తరబడి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. చాలామంది ప్రజలు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ కార్యక్రమ స్థలానికి చేరుకోవాల్సి వచ్చింది. తిమ్మాపురంలో పండ్లు, యోగా మ్యాట్లు, మంచినీటి పంపిణీ విషయంలో తీవ్ర తోపులాటలు చోటు చేసుకున్నాయి. వచ్చిన వారి సంఖ్యకు సరిపడా టీ–షర్టులు, మ్యాట్లు అందుబాటులో లేకపోవడంతో పరిస్థితి మరింత జటిలమైంది. మొబైల్ టాయిలెట్లను దూరంగా ఏర్పాటు చేయడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనకాపల్లి, చోడవరం ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులను అర్ధరాత్రి సాగర్‌నగర్, రుషికొండ ప్రాంతాలకు తీసుకురావడంతో వారికి సరైన వసతి లేక రోడ్డు మీదే పడుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని చూసి సీనియర్ సిటిజన్లు చలించిపోయారు. పోలీసులకు కూడా సరైన వసతులు కల్పించకపోవడంతో వారు ఫుట్‌పాత్‌ల పైనే పడుకోవాల్సి వచ్చింది. రికార్డుల పట్ల ఉన్న శ్రద్ధ.. ప్రజల సౌకర్యాలపై లేకపోవడంతో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.


టీ-షర్టుల కోసం బారులు తీరిన ప్రజలు

ప్రభుత్వ వైఫల్యం.. అల్లాడిన జనం

మధురవాడ: డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం.. శనివారం ఉదయం అరుపులు, కేకలు, తోపులాటలతో రణరంగాన్ని తలపించింది. యోగాంధ్ర నిర్వాహకుల వైఫల్యం కారణంగా పాల్గొన్న వారు తీవ్ర ఇబ్బందులు పడగా.. కనీసం తాగునీరు కూడా అందక జనం అల్లాడిపోయారు. పండ్ల కోసం కొట్టుకునే పరిస్థితి నెలకొంది. అనకాపల్లి జిల్లా, భీమిలి, గాజువాక నియోజకవర్గాల నుంచి సుమారు 50 వేల మందికి క్రికెట్ స్టేడియం, బీ గ్రౌండ్, సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాల, ఎండాడ లా కాలేజీ తదితర ప్రాంతాలను కేటాయించారు. అయితే వీరికి స్థలాల కేటాయింపులో స్పష్టత లేకపోవడం, సమయం దాటిన తర్వాత కూడా భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో పరిస్థితి అదుపు తప్పింది. కార్యక్రమంలో పాల్గొన్న వారికి అల్పాహారం, టీ–షర్టులు, యోగా మ్యాట్‌లు పంపిణీ చేయడంలో నిర్వాహకులు చేతులెత్తేశారు. కొందరు తాగునీరు, అరటి పండ్ల కోసం ఒకరినొకరు తోసుకున్న దృశ్యాలు కనిపించాయి. తొపులాటలో కిందపడినా అదృష్టవశాత్తూ కొందరు సురక్షితంగా బయటపడ్డారు. యోగాసనాలు పూర్తయిన తర్వాత.. గాజువాక నియోజకవర్గానికి చెందిన వారి కోసం కేటాయించినవని చెప్పి మ్యాట్లను వదిలి వెళ్లమని కూటమి నాయకులు ప్రకటించారు. అయితే ప్రజలు వారి మాటలను లెక్కచేయకపోవడంతో గందరగోళం నెలకొంది. చివరికి ఎవరి మ్యాట్‌లు వారే తీసుకెళ్లాలని ప్రకటించాల్సి వచ్చింది. గ్యాలరీల్లో ఉన్న, కిట్‌లు అందని జనం.. యోగా చేసిన వారి కంటే ఎక్కువగా ఉన్నారు. కిట్‌ల కోసం జరిగిన తోపులాట, లాక్కోవడం వంటివి క్రికెట్ స్టేడియం వాతావరణాన్ని యుద్ధభూమిలా మార్చేశాయి. పోలీసులు రంగప్రవేశం చేసినా పరిస్థితిని అదుపు చేయలేకపోయారు. దీంతో కూటమి నాయకులు కిట్‌లను బస్సుల్లో ఇస్తామని చెప్పి, బలవంతంగా తమ వ్యక్తిగత వాహనాల్లో ఎత్తుకెళ్లినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇది మరింత ఉద్రిక్తతకు దారితీసింది. అనకాపల్లి జిల్లా నుంచి వచ్చిన విద్యార్థులు కాలకృత్యాల కోసం వాటర్ బాటిళ్లు పట్టుకుని పొదలు, డొంకల్లోకి వెళ్లాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. కనీసం తాగునీరు కూడా అందించలేదని, గొంతులు ఎండిపోతున్నాయని ప్రజలు గగ్గోలు పెట్టినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. పోలీసులు, నాయకులు గ్యాలరీల్లోకి వెళ్లమని సూచించినప్పటికీ... క్రికెట్ స్టేడియం సిబ్బంది మాత్రం అద్దాలు పగిలిపోతాయని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది.


పీఎంపాలెం క్రికెట్ స్టేడియంలో పోలీసుల సాయంతో కిట్స్ కారులోకి ఎక్కిస్తున్న కూటమి నాయకులు


పీఎంపాలెం క్రికెట్ స్టేడియంలో కిట్స్ కోసం ఎగబడుతున్న జనం

చేపలుప్పాడ వద్ద తోపులాట

తగరపువలస: యోగాంధ్రలో భాగంగా బీచ్‌రోడ్డులోని చేపలుప్పాడ ఏ81– అ కంపార్ట్‌మెంట్ వద్ద శనివారం తీవ్ర గందరగోళం, తోపులాట జరిగింది. తొలుత ఈ ప్రాంతంలో యోగాసనాలకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. అయితే అధికారులు అప్పటికప్పుడు రోడ్డు పక్కన డ్రైనేజీని ఆనుకుని ఉన్న లోతట్టు ప్రదేశంలో వేదికను ఏర్పాటు చేశారు. భీమిలి అర్బన్, రూరల్ ప్రాంతాల నుంచి బలవంతంగా తీసుకువచ్చిన సుమారు 2వేల మందిని ఇక్కడ కేటాయించారు. నేలపై ఎలాంటి పరదాలు లేదా గ్రీన్ మ్యాట్లు వేయలేదు. కటిక నేలపైనే కూర్చోబెట్టి ఒక స్క్రీన్ ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీ ప్రసంగం జరుగుతున్న సమయంలో వలంటీర్లు, డ్వాక్రా లీడర్లు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకుల మధ్య కుమ్ములాటలు మొదలయ్యాయి. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి వసతి చూపకపోవడంతో పరిస్థితి మరింత దిగజారింది.


ఫుడ్ ప్యాకెట్ల కోసం ఆరాటం


మ్యాట్‌లు, టీ షర్టుల కోసం తోపులాట

యోగా మ్యాట్‌లు, టీ షర్టులు, ఫుడ్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు, పండ్ల పంపిణీ విషయంలో తీవ్ర తోపులాట జరిగింది. బలవంతులు బాక్సులతో సహా వాటిని లూటీ చేయగా, సీనియర్ సిటిజన్లు, మహిళలకు ఎలాంటి సామగ్రి అందలేదు. ఈ తోపులాటలో పండ్లు, ఫుడ్ ప్యాకెట్లు కాళ్ల కిందపడి పాడైపోయాయి. ఇది జీవీఎంసీ, ప్రభుత్వ వైఫల్యమేనని వచ్చిన వారు మండిపడ్డారు.

అంతటా గందరగోళం

- రోడ్డుమీదే కేటాయించిన స్థలాల్లోనే నిద్ర
- అల్పాహారం కోసం తోపులాటలు
- స్థలం నిండిపోవడంతో బయటే ఉండిపోయిన జనం
- ప్రారంభమైన కొద్దిసేపటికే లేచి వెళ్లిపోయిన వైనం


బీచ్‌రోడ్డులో యోగా నిర్వహించే స్థలం వద్ద నిద్రిస్తున్న శ్రీకాకుళం జిల్లా వాసులు

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ మార్లిన్‌కే రెస్టారెంట్ దాటిన తరువాత కొద్ది దూరంలో 127 పాయింట్‌లో ఆఖరి స్టేజ్ ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆయా పాయింట్‌ల వద్ద శ్రీకాకుళం, విజయగరం వారికి కేటాయించారు, దీంతో రాత్రి రెండు గంటల ప్రాంతంలో ఇక్కడికి చేరుకున్న శ్రీకాకుళం జిల్లా వాసులు తమకు కేటాయించిన స్థలంలోనే విశ్రమించారు. కాగా చివరి రెండు పాయింట్లు భీమిలి పరిసరాల్లోని పాఠశాలల విద్యార్థులకు కేటాయించారు, దీంతో ఉదయం నాలుగు గంటల నుంచి విద్యార్థులు రావడం మొదలు పెట్టారు. మార్లిన్‌కే రెస్టారెంట్ ప్రాంగణం విశాలంగా ఉండడంతో అక్కడ ఎక్కువ మంది పాల్గొనే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇక్కడ భీమిలి మండల, జోన్ పరిధిలోని వారికి కేటాయించారు. ఇక్కడికి జనం ఎక్కువగా రావడంతో లోపలి స్థలం పూర్తిగా నిండిపోయి, చాలామంది బయట ఉండిపోయారు. యోగాసనాల ప్రదర్శన ప్రారంభం కాకముందే అల్పాహార ప్యాకెట్లు ఇవ్వడం మొదలు పెట్టడంతో అప్పటివరకు కూర్చుని ఉన్నవారిలో చాలా మంది లేచి వాటి కోసం ఎగబడడంతో ఒక్కసారిగా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

ముందే సర్దేసుకుని..

పీఎం పాలెం: స్థానిక క్రికెట్ స్టేడియం బీ గ్రౌండ్, సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఉన్న స్థలాల్లో కంపార్టుమెంట్లుగా ఏర్పాటు చేసి యోగా డేను నిర్వహించారు. యోగా డేకు సుమారు 22 వేల మంది ప్రజలు హాజరు కాగా అక్కడి ఏర్పాట్ల కారణంగా నిరుత్సాహానికి గురయ్యారు. యోగా మ్యాట్‌లు, టీ షర్ట్‌ల కోసం ప్రజలు తోపులాటకు దిగిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ముందుగా ప్రాక్టీస్ లేకపోవడంతో తెరపై ప్రదర్శించే ఆసనాలు అనుసరించేందుకు కొందరు ఇబ్బంది పడ్డారు. కార్యక్రమం మొదలైన కొన్ని నిమిషాలైనా గడవకముందే ఒకరొకరుగా తమ స్థలాలు వీడి మ్యాట్‌లు సర్దుకుని వెళ్లడం కనిపించింది. శాంతిమంత్రం చదివే సమయానికి చాలా కంపార్ట్‌మెంట్లలో అధిక శాతం ఖాళీ అయిపోయాయి.

రెండున్నర గంటలు చెట్ల కిందే ..

తగరపువలస: యోగాంధ్రలో పాల్గొనేందుకు వచ్చిన వారికి సరైన వసతి లేక ఇబ్బంది పడ్డారు. ఉత్తరాంధ్రలోని వివిధ జిల్లాల నుంచి విద్యార్థులు వ్యయప్రయాసలకు ఓర్చి ఉదయం 5 గంటలకు చేరుకున్నా, నిర్వాహకులు వీరికి కంపార్ట్‌మెంట్ కేటాయించలేకపోయారు. విజయనగరం పట్టణంలోని ద్వారపూడికి చెందిన శ్రీమహలక్ష్మి జూనియర్ కళాశాలకు చెందిన 80 మంది విద్యార్థులు రెండు వాహనాలలో భీమిలి చేరుకున్నా నిర్వాహకులు వీరికి భాగస్వామ్యం కల్పించలేకపోయారు. దీంతో విద్యార్థులు రెండున్నర గంటల పాటు చెట్ల కింద, ఎండలోను ఉండిపోయి వెనుదిరిగారు. సచివాలయాల ద్వారా సిబ్బంది తరలించిన వారికి నిర్వాహకులు కంపార్ట్‌మెంట్లు కేటాయించలేకపోయారు. దీంతో ఆసనాలు జరుగుతుండగానే వేలాది మంది మహిళలు ఉసూరుమంటూ వెనుదిరిగారు.


లోపలికి రావడానికి బారులు తీరిన మహిళలు


స్థలం నిండిపోవడంతో బయట ఉండిపోయిన జనం


కంపార్ట్‌మెంట్ కేటాయించకపోవడంతో రోడ్డుపై నిలబడిన విజయనగరం శ్రీమహలక్ష్మి జూనియర్ కళాశాల విద్యార్థులు


కంపార్ట్‌మెంట్ కేటాయించకపోవడంతో ఆసనాలు జరుగుతుండగానే ఇళ్లకు వెళ్లిపోతున్న మహిళలు


అల్పాహారం కోసం పోటీ పడుతున్న జనం